
సాక్షి తిరుపతి

గురువారం । 23 । నవంబర్ । 2023



కల్లోల కడలి
తుపాను ప్రభావంతో వాకాడు మండలంలోని సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది. అలలు ఎగసిపడుతున్నాయి. - 8లో



టీడీపీ పాపాలు మాపై రుద్దకండి
టీడీపీ పాపాలను తమకు ఆపాదించవద్దని మంత్రి రోజా స్పష్టం చేశారు. ఎల్లోమీడియాపై మండిపడ్డారు. - 8లో



బధిర విద్యార్థికి నిప్పు
తిరుపతిలోని టీటీడీ బధిర పాఠశాలలో ఓ విద్యార్థికి సహచర విద్యార్థులు ఆకతాయితనంతో నిప్పు పెట్టారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు 'కల్యాణమస్తు.. షాదీ తోఫా'

- నాలుగో విడతలో 535 మందికి రూ.4.42 కోట్లు



తిరుపతి అర్బన్: నిరుపేద తల్లిదండ్రులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వారి పిల్లల పెళ్లికి ఆర్థికసాయం అందిస్తోంది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడబిడ్డలకు వైఎస్సార్ కల్యాణమస్తు, మైనారిటీలకు వైఎస్సార్ షాదీ తోఫా పథకాల కింద నేరుగా తల్లుల ఖాతాలో నగదు జమ చేస్తోంది. ఈ మేరకు గురువారం తాడేపల్లె క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో నాలుగో విడత కింద నగదు అందజేయనున్నారు. తిరుపతి కలెక్టరేట్‌లో ఉదయం 10.30 గంటలకు జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లావ్యాప్తంగా వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా కింద మొత్తం 535 మందికి లబ్ధి చేకూరనుంది. వారి ఖాతాల్లో మొత్తం రూ.4,42,30,000 జమ చేయనున్నారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 13 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 69,981 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 20,492 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.55 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

ఆగమోక్తంగా 'ఆకాశ దీపం'



ఆకాశదీపం ఎగురవేస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం ఆగమోక్తంగా ఆకాశదీపం వెలిగించారు. కార్తీక మాసం సందర్భంగా ముక్కంటి ఆలయంలో నిత్యం ఆకాశ దీపం వెలిగించడం ఆనవాయితీ. ఈ మేరకు ఆలయంలోని ఊంజల్‌సేవ మండపం వద్ద కార్తీక దీపానికి పూజలుచేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

శ్రీసిటీ సందర్శించిన ఆర్టీసీ ఎండీ



ద్వారకా తిరుమలరావుకు స్వాగతం పలుకుతున్న రవీంద్ర సన్నారెడ్డి

సత్యవేడు: ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు బుధవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి, పారిశ్రామిక నగర ప్రగతి, ప్రత్యేకతలు వివరించారు. సమీపంలోని పట్టణాలు, గ్రామాలను కలిపే ప్రజా రవాణా సదుపాయం లేకపోవడంతో ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆర్టీసీ ఎండీ దృష్టికి తీసుకువచ్చారు. సత్యవేడు, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, తడ నుంచి శ్రీసిటీకి ఆర్టీసీ బస్సు సర్వీసులు నడిపేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. పారిశ్రామిక హబ్‌లోని ప్రధాన నగరాలను కలుపుతూ జనరల్‌షిఫ్ట్ వేళలకు అనువుగా సర్వీసులు ఉండేలా చూడాలని సూచించారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆర్టీసీ ఎండీ స్పందించారు. ఈ విషయాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ కేఎస్ బ్రహ్మానంద రెడ్డి పాల్గొన్నారు.

యువత.. భవిత



- నియోజకవర్గాల వారీగా స్కిల్ హబ్‌లు
- యువతీయువకుల్లో నైపుణ్యాల మెరుగునకు చర్యలు
- డీఆర్‌డీఏ– వైకేపీ ఆధ్వర్యంలో శిక్షణ
- ఉద్యమంలా జాబ్‌మేళాలు
- నాలుగున్నరేళ్లలో 10,173 మందికి ఉద్యోగాలు

ఉద్యోగం సాధించాలి.. మంచి వేతనం అందుకోవాలి.. తల్లిదండ్రులకు అండగా నిలవాలి.. సమాజంలో ఉన్నతంగా జీవనం సాగించాలి.. యువతీయువకుల కల ఇది. ఇందుకోసం కష్టపడి చదువుతుంటారు.. పోటీ ప్రపంచంలో పరుగులు తీస్తుంటారు. కొందరు ఈ టాస్క్‌లో విజయతీరాలకు చేరుకుంటారు. మరికొందరు వెనుకంజ వేస్తుంటారు. అయితే అందరికీ ఉత్తమ భవిత అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తోంది. అందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో స్కిల్ హబ్‌లను నెలకొల్పింది. యువతలో నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేకంగా శిక్షణ అందిస్తోంది. అనంతరం జాబ్‌మేళాలను ఏర్పాటు చేసి ఉద్యోగావకాశాలను కల్పిస్తోంది.



చిత్తూరు స్కిల్ కళాశాలలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

పిచ్చాటూరు : యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా జిల్లాలో మొత్తం 8 స్కిల్ హబ్‌లు, 2 స్కిల్ కాలేజీలను ఏర్పాటు చేసింది. తక్కువ విద్యార్హతలు ఉన్నవారితో పాటు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాని వారికి సైతం శిక్షణ అందిస్తోంది. జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ప్లంబర్ జనరల్... తదితర కోర్సుల్లో యువతకు శిక్షణ ఇప్పిస్తోంది. ఒక్కో హబ్ లో ఏడాదికి నాలుగు బ్యాచ్‌ల చొప్పున శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. ప్రతి బ్యాచ్‌లో 30 మంది చొప్పున 120 మంది శిక్షణ పొందుతున్నారు. ఒక్కో హబ్‌లో రెండు రకాలుగా కనిష్టంగా 45 రోజులు గరిష్టంగా 3 నెలల పాటు శిక్షణ ఇస్తారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు దేశ వ్యాప్తంగా వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ నాలుగున్నరేళ్లలో 2019 నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో మొత్తం 106 జాబ్ మేళాలు నిర్వహించారు. మొత్తం 14,296 మంది యువత హాజరయ్యారు. అందులో 10,173 మంది ఉద్యోగాలు పొందినట్లు డీఆర్‌డీఏ వెల్లడిస్తున్నారు.



చిత్తూరు స్కిల్ కాలేజీలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

వివిధ కోర్సుల్లో శిక్షణ

డీఆర్‌డీఏ-వైకేపీ అధ్వర్యంలో ప్రత్యేకంగా చిత్తూరు, తిరుపతిలలో రెండు స్కిల్ కాలేజీలు నడుస్తున్నాయి. చిత్తూరులోని టీటీడీసీలో, తిరుపతిలోని జూపార్క్ సమీపంలో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ అప్లైడ్ న్యూట్రీషియన్‌లో స్కిల్ కాలేజీలు ఉన్నాయి. తిరుపతిలో కిచెన్ సూపర్‌వైజర్, రెస్టారెంట్ కెప్టెన్ కోర్సులకు సంబంధించి ఉపాధితో కూడిన ఉచిత శిక్షణ అందిస్తున్నారు. చిత్తూరు టీటీడీసీలోని స్కిల్ కాలేజీలో అపోలో మెడ్ స్కిల్స్ సహకారంతో పేషెంట్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్, పేషెంట్ రిలేషన్ డ్యూటీ మేనేజర్, రిటైల్ సేల్స్ సూపర్‌వైజర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి సదుపాయాలతో పాటు స్టడీ మెటీరియల్, యూనిఫామ్ అందిస్తున్నారు.



తిరుపతి స్కిల్ కళాశాలలో విద్యార్థుల ప్రాక్టికల్స్

జిల్లాలోని స్కిల్ హబ్‌ల సమాచారం

నియోజకవర్గం	శిక్షణ ఇచ్చే కేంద్రం
పుత్తూరు	:ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల
శ్రీకాళహస్తి	: పభుత్వ మహిళా డిగ్రీ కళాశాల
నగరి	: ప్రభుత్వ ఐటీఐ కళాశాల
సత్యవేడు	: ప్రభుత్వ పాలిటెక్నిక్
సూళ్లూరుపేట	: ప్రభుత్వ ఐటీఐ, శ్రీసిటీ
చంద్రగిరి	: ప్రభుత్వ ఐటీఐ కళాశాల
తిరుపతి	: ప్రభుత్వ పాలిటెక్నిక్
తిరుపతి	: ఏపీ టూరిజమ్ కళాశాల

ప్రత్యేక కమిటీ ఏర్పాటు

జిల్లా స్థాయిలో స్కిల్ అభివద్ధికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. స్కిల్ హబ్‌ల నిర్వహణ, నైపుణ్యాల అభివృద్ధిపై ఇచ్చే శిక్షణ కార్యక్రమాలను ఈ కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. డీఆర్‌డీఏ–వైకేపీ పీడీ కన్వీనర్‌గా ఉంటారు. కమిటీలో జిల్లా ఉపాధి కల్పన సంస్థ న్యాక్ అధికారులు, పాలిటెక్నిక్, ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాళ్లు సభ్యులుగా ఉంటారు.

రూ.20వేల వేతనం వస్తోంది



డిగ్రీ పూర్తైన వెంటనే చిత్తూరు స్కిల్ కాలేజీలో శిక్షణ తీసుకున్నా. ట్రైనింగ్ అయిన తర్వాత సీడాప్–డీఆర్‌డీఏ ప్రతినిధులే తిరుపతిలోని విజయ డొమెస్టిక్ సెంటర్‌లో ఉద్యోగ అవకాశం కల్పించారు. ప్రస్తుతం రూ.20 వేల వేతనం వస్తోంది. మా కుటుంబానికి అండగా ఉంటే ఎంతో సంతృప్తిగా ఉంది.
– కరుణశ్రీ, పుల్లయ్యగారిపల్లె, చిత్తూరు

ఎనలేని మేలు



చదువు పూర్తైన తర్వాత చాలా ఇంటర్వ్యూలకు వెళ్లినా జాబ్ రాలేదు. దీంతో చిత్తూరు టీటీడీసీలో నిర్వహిస్తున్న స్కిల్ కళాశాలలో 45 రోజుల కోర్సు పూర్తి చేశా. అక్కడి అధికారులే నాకు మదనపల్లెలోని రాధాకృష్ణ జ్యువెలరీస్‌లో ఉద్యోగం ఇప్పించారు. ప్రస్తుతం రూ.15 వేలు వేతనం పొందుతున్నా. ప్రభుత్వం నాకు ఎనలేని మేలు చేసింది.
– ధనుష్, గొడమాకులపల్లె, పెద్దపంజాణి మండలం

సద్వినియోగం చేసుకోవాలి



ప్రస్తుతం కంపెనీలకు అవసరమైన నైపుణ్యాల్లో యువతకు ప్రత్యేక శిక్షణను స్కిల్ కాలేజీలు, స్కిల్ హబ్‌ల ద్వారా అందిస్తున్నాం. ఆ సమయంలో అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నాం. ప్రతి విషయంలోనూ అండగా నిలుస్తున్నాం. వారిలో నైపుణ్యాలను మెరుగు పరుస్తున్నాం. ఉద్యోగాలు వచ్చేలా ముందుకు తీసుకెళుతున్నాం. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి.
– తులసి, సీడాప్– డీఆర్‌డీఏ పీడీ, ఉమ్మడి చిత్తూరు జిల్లా

1 నుంచి ఓటు యంత్రాలపై అవగాహన



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : ఓటింగ్ యంత్రాలపై క్షేత్రస్థాయిలో ఓటర్లకు డిసెంబర్ 1వ తేదీ నుంచి అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో మొబైల్ వాహనాల ద్వారా ఎం-3 ఓటింగ్ యంత్రాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అలాగే కలెక్టరేట్, తిరుపతి కార్పొరేషన్,, ఆర్‌డీఓ కార్యాలయాల వద్ద ప్రత్యేకగా ఓటింగ్ యంత్రాలను అందుబాటులో ఉంచనున్నట్లు వివరించారు. ఈ క్రమంలోనే ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా ఓటరు జాబితా రూపొందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు నగేష్ , సుధారెడ్డి, ఎంపీ నాయుడు , జయచంద్ర, రవి, ఆర్‌డీఓలు నిశాంత్ రెడ్డి, కిరణ్ కుమార్ , రవిశంకర్‌రెడ్డి , చంద్రముని, స్పెషల్ డిప్యూటి కలెక్టర్లు కోదండరామిరెడ్డి, శ్రీనివాసులు , తిరుపతి కార్పొరేషన్ డీసీ చంద్రమౌళీశ్వర రెడ్డి , ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డీసీసీబీలో తక్కువ వడ్డీకే రుణాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఈఓ సరిత

వెంకటగిరిరూరల్ : నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో ఖాతాదారులకు తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నట్లు సీఈఓ సరిత తెలిపారు. బుధవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సున్నా నగదుతో బ్యాంకులో ఖాతాలు ప్రారంభించినా రూ. 2లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మీ భవిష్యత్‌కు మా సహకారం పేరిట పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏజీఎం చంద్రశేఖర్, చీఫ్ మేనేజర్ రాజా తిరుమల దేవి పాల్గొన్నారు.

పేదల కోసమే వైఎస్సార్‌సీపీ



సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : పేదలను ఆదుకునేందుకే వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించిందని టీటీడీ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతిలోని 2, 20వ డివిజన్‌లలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగున్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ దేశ రాజకీయ చరిత్రలో ఏ నాయకుడు నేరుగా సంక్షేమ లబ్ధిని ప్రజల ఖాతాల్లో నేరుగా జమ చేయలేదని, పారదర్శకంగా పథకాలు అమలు చేసిన ఏకైక నేత జగనన్న అని కొనియాడారు. సీఎం వైఎస్ జగన్ ఉన్నారనే ధైర్యంతో పేదలు సంతోషంగా జీవనం సాగిస్తున్నారన్నారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను ఓర్వలేకే చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎల్లోమీడియా సహకారంతో విషం కక్కుతున్నారని ఆరోపించారు. జగనన్న పేదల బతుకుల్లో వెలుగులు నింపితే, చంద్రబాబు చీకట్లతో జీవితాలను ఛిద్రం చేశారని విమర్శించారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న జగనన్నకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు చంద్రబాబు కొత్తగా పవన్‌కల్యాణ్‌తో పొత్తు పెట్టుకుని వస్తున్నారని, ఆయన కట్టుకథలను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఎక్కడికి వెళ్లినా మళ్లీ జగనే మాకు సీఎంగా కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. జగనన్న అందించిన సంక్షేమ పథకాలతోనే తాము ప్రజల్లోకి ధైర్యంగా వెళ్లగలుగుతున్నామని వెల్లడించారు. ముఖ్యమంత్రి సహకారంతోనే తిరుపతిని అద్భుతంగా అభివృద్ధి చేయగలిగామని చెప్పారు. 26వేల మంది సొంతింటి కలను నెరవేర్చగలిగామని వివరించారు. జగనన్నను గెలిపిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు అజయ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి పడమటి కుమార్, కార్పొరేటర్లు ఉమా అజయ్, రాజమ్మ, జేసీఎస్ అధ్యక్షుడు దొడ్డారెడ్డి మురళీరెడ్డి, ఉదయగిరి రమేష్, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ మబ్బు నాథమునిరెడ్డి, మాకం చంద్రయ్య, స్థానిక నాయకులు తిమ్మారెడ్డి, వెంకటమునిరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాక్షేత్రంలో సాంకేతిక విప్లవం

- చంద్రగిరి సోషల్ మీడియా ప్రతినిధుల సమావేశంలో తుడా చైర్మన్ మోహిత్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : ప్రజా క్షేత్రంలో సాంకేతిక విప్లవం కొనసాగుతోందని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ.. అభివృద్ధి పథకాల వివరాలను ప్రజలకు చేరవేసేందుకు సోషల్ మీడియా చక్కటి వేదికగా పనిచేస్తోందని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. బుధవారం తుమ్మలగుంటలో చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ అందుబాటులోని సాంకేతికతను అందిపుచ్చుకుని సమర్థవంతంగా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. అనవసర విమర్శలతో మన సహనాన్ని పరీక్షించే వారి విషయంలో సంయమనం పాటించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులుగా పార్టీ, అభ్యర్థుల గౌరవం ఇనుమడించేలా పోస్టులు పెట్టాలని కోరారు. సమష్టిగా సైనికుల్లా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. సామాజిక స్పృహతో పనిచేస్తే భవిష్యత్ నాయకులుగా ఎదిగే అవకాశముంటుందని తెలిపారు.

ఎమ్మెల్యే చెవిరెడ్డి చేసిన అభివృద్ధి అందరికీ తెలుసు

చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చేసిన అభివృద్ధి అందరికీ తెలుసని మోహిత్‌రెడ్డి వెల్లడించారు. ప్రజలను కుటుంబ సభ్యుల్లా భావించి పండుగల వేళ ఇచ్చే కానుకలను కూడా కొందరు విమర్శించడం దారుణమన్నారు. కోవిడ్ సమయంలో, రాయల చెరువు గండి పడినప్పుడు ప్రాణాలు పణంగా పెట్టి, నిద్రాహారాలు మాని చేసిన సాయాన్ని కూడా తప్పుబట్టే దుస్థితికి ప్రతిపక్షాలు దిగజారుతున్నాయని విమర్శించారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా రూ.2 కోట్ల మేర అభివృద్ధి పనులతో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మార్క్ కనిపిస్తుందని స్పష్టం చేశారు. ప్రతీకార చర్యలు, విమర్శలు, అవినీతికి తావులేకుండా ప్రజాశ్రేయస్సు కోసం అనుక్షణం పరితపించారని వెల్లడించారు. 95 శాతం మందికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందుతున్నాయని వివరించారు. ప్రతిపక్ష నాయకుడు, ఆయన కుటుంబ సభ్యులు ఎన్నికలకు 6 నెలల ముందు చేస్తున్న హడావుడిని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బాలిశెట్టి కిషోర్, కో-కన్వీనర్ రాకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధిస్తారని స్పష్టం చేశారు. అనంతరం మోహిత్ అన్న సోషల్ మీడియా సోల్జర్స్ పేరిట లోగో ఆవిష్కరించారు.

పకడ్బందీగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ హరిత

తిరుపతి క్రైం : తిరుపతి నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. బుధవారం తిరుపతి పోలీస్ కార్యాలయంలో అధికారులు, ఐఐటీ ప్రొఫెసర్లు, పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఎంఎస్ సుబ్బులక్ష్మి సర్కిల్ వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై పవర్ ప్రజెంటేషన్ ద్వారా ఐఐటీ ప్రొఫెసర్ కృష్ణ ప్రపూర్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ గౌరీ వివరించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ నలువైపులా పెట్టడం వల్ల వాహనాలు అధిక సంఖ్యలో ఎక్కువ సమయం నిలిచిపోయే పరిస్థితి ఉండడంతో, మాన్యువల్‌గానే ట్రాఫిక్ నియంత్రించాలని నిర్ణయించారు. నగరంలోని ప్రధానమైన ఎనిమిది సర్కిల్స్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ సమయపాలన నిర్వహణ, సీసీ కెమెరాల పర్యవేక్షణ, ఫ్రీ లెఫ్ట్‌లు, మరమ్మతులు, నిర్వహణ మొత్తం మున్సిపల్ కార్పొరేషన్ అప్పగించాలని తీర్మానించారు. శ్రీనివాససేతుపై ట్రాఫిక్ పర్యవేక్షణ కోసం ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైన ప్రదేశాల్లో స్పీడ్ బ్రేకర్లు, టర్నింగ్ పాయింట్ల వద్ద సూచిక బోర్డులు, రోడ్డుపై ప్రత్యేక పెయింట్ సూచిక గీతలు ఏర్పాటు చేయించాలని నిర్ణయించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ కులశేఖర్ , ట్రాఫిక్ డీఎస్పీ నరసప్ప, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, ఏయికామ్ సంస్థ ప్రతినిధి బాలాజీ, ఆప్కాన్ సంస్థ ప్రతినిధి రంగస్వామి, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్ రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం



క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో వీసీ సుందరవల్లి

గూడూరు రూరల్ : క్రీడలతో మానసిక వికాసం పొందవచ్చని విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ సుందరవల్లి తెలిపారు. బుధవారం పట్టణంలోని ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న వీఎస్‌యూ అంతర కళాశాలల పోటీల్లో భాగంగా పురుషుల విభాగంలో క్రీడలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలు కూడా అవసరమే అన్నారు. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించే మనోధైర్యాన్ని అందిస్తాయని వెల్లడించారు. క్రీడలలో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని వివరించారు. అనంతరం వీసీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ రామ చంద్రారెడ్డి, ఎస్కేఆర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, పీడీ నాగరాజు, అధ్యాపకులు మాల్యాద్రి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎస్వీ మెడికల్ కళాశాలకు ప్లాస్టిక్ సర్జరీ

సూపర్ స్పెషాలిటీ పీజీ సీట్లు



నియామక పత్రం అందిస్తున్న వైద్యాధికారులు

తిరుపతి తుడా: ఎస్వీ మెడికల్ కళాశాల, రుయా ఆసుపత్రికి తొలిసారిగా 92 ప్లాస్టిక్, రీ కన్‌స్ట్రక్టివ్ సర్జరీ, సూపర్ స్పెషాలిటీ పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఎస్వీ మెడికల్ కళాశాల చరిత్రలో ఇప్పటి వరకు ఈ విభాగంలో పీజీ సీట్లు మంజూరు కాలేదు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా రుయాను అప్‌గ్రేడ్ చేశారు. ఆసుపత్రికి అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కల్పించడంతో మెడికల్ కౌన్సిల్ ఎస్వీ మెడికల్ కళాశాలకు పీజీ సీట్లు, గ్రాంట్‌ను మంజూరు చేసింది. ఈ క్రమంలో పీజీ సీట్లను భర్తీ చేశారు. ఈ క్రమంలో పీజీ సీట్లు పొందిన ఏపీకి చెందిన డాక్టర్ ప్రణయ్, కేరళకు చెందిన డాక్టర్ కేపీ.యహ్యాకు బుధవారం ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ నియామక పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ 60 ఏళ్ల చరిత్ర కలిగిన ఎస్వీ మెడికల్ కళాశాలకు నూతన వైభవం వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో మెడికల్ కళాశాల స్థాయి పెరిగిందని పేర్కొన్నారు. పూర్తి స్థాయిలో వైద్యుల నియామకాలు చేపట్టడంతో వైద్య విద్య పరిపుష్టిగా ఉందన్నారు. పేద రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు సూపర్ స్పెషాలిటీ ఎంతగానో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఫార్మసీ కళాశాల భవన నిర్మాణానికి భూమిపూజ

తిరుపతి సిటీ: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల మెదటి అంతస్తు నిర్మాణానికి ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య రాజారెడ్డి మంగళవారం భూమిపూజ చేశారు. రూ.2.5 కోట్లతో నిర్మించనున్న పైఅంతస్తు కారణంగా ఫార్మసీ విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్ , ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య అప్పారావు, బిల్డింగ్ ఇంజినీర్ సుబ్రహ్మణ్యం, యూనివర్సిటీ ఇంజినీర్ తాండవకృష్ణ పాల్గొన్నారు.

టీడీపీ పాపాలు మాపై రుద్దకండి

- నేను మంచివాళ్లకు ఎప్పుడూ ఫేవరే... చెడ్డవాళ్లకే ఫైర్
- పచ్చపత్రికలో వచ్చిన కథనంపై మంత్రి రోజా ఆగ్రహం
- వాస్తవాలు తెలుసుకొని రాయాలంటూ హితవు



మాట్లాడుతున్న మంత్రి రోజా

నగరి : టీడీపీ పాపాలను తమపై రుద్దవద్దని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా బుధవారం నగరి నియోజకవర్గంలో అభివృద్ధి చతికిలబడిందంటూ పచ్చపత్రికలో వచ్చిన కథనంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిండ్ర మండలం కొప్పేడులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె పచ్చపత్రికలు చేసిన అసత్య ప్రచారాన్ని ఎండగట్టారు. నిజానిజాలు తెలుసుకుని రాయాలంటూ వాస్తవాలను వెల్లడించారు. నేత కార్మికులకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తానని జగనన్న ఎన్నికల హామీ ఇవ్వలేదన్నారు. అన్ని విధాలా ఆదుకుంటాం అని మాత్రమే చెప్పామని, ఆ మాట మేరకు నేతన్న నేస్తంతో పాటు పలు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం పవర్ లూమ్ విద్యుత్‌ను కేటగిరీ 4 నుంచి 3కు మార్చేస్తే అది నేడు అమలులోకి వచ్చిందని, ఆ కారణంగా విద్యుత్ బిల్లు పెరిగిందన్నారు. అందుకే వారికి వచ్చే అదనపు చార్జీలు తగ్గిస్తున్నట్లు నగరి సభలో ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, దానిని అమలు చేయడానికి ప్రక్రియ నడుస్తోందన్నారు. పుత్తూరులో నీరు నిల్వ చేసే ప్రాంతంలో సమ్మర్ స్టోరేజ్ నిర్మించకుండా, టీడీపీ నాయకులు స్వలాభం, కమీషన్ల కోసం నీరు చేరని ప్రాంతంలో నాసిరకంగా కట్టేశారన్నారు. అది దాహం తీర్చడానికి పనికిరాలేదన్నారు. ప్రస్తుతం బోరు వేసి సమ్మర స్టోరేజికి నీటిని పంప్ చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం తెలుగు గంగ నుంచి పైప్‌లైన్ మంజూరు చేసినట్లు ప్రకటించినా భూ సేకరణ, నీటి కేటాయింపు చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక 2019, జూన్ 15వ తేదీన పైప్‌లైన్ ప్రాజెక్టు ఏఐఐబీ ద్వారా రూ.139 కోట్లు మంజూ చేస్తే శాశ్వత మంచి నీటి సరఫరాకు పైప్‌లైన్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయన్నారు. గొల్లపల్లి పీహెచ్‌సీకి స్థలం మంజూరు చేసినట్లు టీడీపీకి చెందిన మాజీ ఎంపీపీ గంజి మాధవయ్య ప్రకటించి, 2018, సెప్టెంబరు 28న శిలాఫలకం వేశారని, తన సొంత భూమిలా గంజి మాధవయ్య ఆయన తండ్రిపేరు అందులో వేసుకున్నారని అయితే దానికి సంబంధిత స్థల రికార్డులు ఏవీ లేవన్నారు. శ్రీభావనా రుషేశ్వర స్వాముల దేవస్థానం వారేమో అది తమ స్థలం అంటున్నారని, 1బిలో శ్రీభువనేశ్వరి వారి దేవాలయం అని ఉందని ఇంత గందరగోళం ఉన్నందునే నిర్మాణం ఆగిందన్నారు. మున్సిపల్ కార్యాలయం మంజూరు చేశామని చెప్పుకునే టీడీపీ వారు ఎందుకు అప్పుడు కట్టలేదన్నారు. వారు మాటలకు పరిమితం చేస్తే తాము మున్సిపల్ కార్యాలయ నిర్మాణం చేపట్టి చేతల్లో చూపిస్తున్నామన్నారు. నిండ్ర నేటమ్స్ షుగర్స్ ప్రైవేటు చెరుకు ఫ్యాక్టరీ అని, రైతలలకు గత ప్రభుత్వ హయాం నుంచి బకాయిలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఫ్యాక్టరీ వారు కోర్టును ఆశ్రయించడంతో కోర్టు ఫైనాన్షియర్‌కు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో దానిపై కార్మికులు కోర్టుకు వెళ్లారన్నారు. దీంతోనే జాప్యం అవుతోందన్నారు. ప్రభుత్వ నిర్వహణలో ఉన్న చెరుకు ఫ్యాక్టరీలకు సంబంధించి రైతులకు, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు ఇప్పించామన్నారు. నగరి మండలంలోని వీకేఆర్‌పురంలో ఇండస్ట్రియల్ పార్కు 2018, ఏప్రిల్ 27వ తేదీన మంజూరు చేసినట్లు కాగితాల్లో పెట్టి బోర్డును మాత్రమే గత పాలకులు ఏర్పాటు చేశారని, భూ సేకరణ, నష్టపరిహారం చెల్లింపు జరగలేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చాకే 2021, ఫిబ్రవరి 23వ తేదీ నుంచి భూ సేకరణ, రూ.6.64 కోట్ల నష్టపరిహారం చెల్లింపు జరిగిందన్నారు. 2023, జూన్ 1వ తేదీన భూములను నగరి తహసీల్దార్ ఏపీఐఐసీకి అప్పగించారని చెప్పారు. ఆ ప్రాంతంలో జాతీయ రహదారి ఏర్పాటుకు స్థల సేకరణ జరుగుతున్నందున ఆ ప్రక్రియ పూర్తి అయిన తరువాత ఇండస్ట్రియల్ పార్కు పనులు ప్రారంభం అవుతుందన్నారు. గత ప్రభుత్వాలు ఓటు కోసం ఆడిన నాటకమే కాలుష్య శాపమన్నారు. పచ్చపత్రికల్లో కాలుష్యనీరున్నట్లు చూపిన గుంటలు పదిహేనేళ్ల క్రితం నుంచి అలాగే ఉన్నాయన్నారు. వాటితో తనకు సంబంధం లేదని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ప్లాంటును నిర్వహణలోకి తెచ్చానన్నారు. టీడీపీ నాయకుడు, మాజీ వైస్ చైర్మన్ చెర్లోపల్లె రోడ్డు ప్రారంభించారని, దాన్ని పూర్తి చేయకుండా వదలిపెట్టాడన్నారు. జనరల్ ఫండ్‌లో రోడ్డును వేయడానికి ప్రయత్నించినా కోర్టును ఆశ్రయించి అడ్డుపడుతున్నారన్నారు. అందుకే రోడ్డు నిర్మాణం జరగలేదన్నారు. గతంలో గ్రామాలను మున్సిపాలిటీగా మార్చి పన్నులు మాత్రం వసూలు చేసుకున్న పాలకులు సౌకర్యాలను మాత్రం గ్రామస్థాయి కన్నా తక్కువగా వదలిపెడితే నేడు అన్నిరకాల అభివృద్ధి పనులు తాను చేశానని తెలిపారు. ఇసుక దోచుకున్నారు కనుకే టీడీపీని రెండు సార్లు తరిమికొట్టారన్నారు. కుశస్థి నదిని కుశస్థలి వనంగా మార్చేసింది వారే అన్నారు. నేడు రికార్డు పరంగానే ఇసుక తరలింపు జరుగుతోందని వాటితో ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఇందులో ఎవరికైనా సందేహాలుంటే ఏడీ మైన్స్ ఆఫీసుకు వెళ్లి తెలిపి, ఆపేయవచ్చన్నారు. తాము చేసిన ప్రతి పని రికార్డు రూపంగా చెప్పగలమన్నారు.

విద్యార్థినులకు పతకాలు



పతకాలు అందుకుంటున్న విద్యార్థినులు   విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తిరుపతి అర్బన్: నేషనల్ లెవల్ అథ్లెటిక్స్ పోటీల్లో తిరుపతికి చెందిన విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ చూపి కాంస్య పతకాలు సాధించారు. తిరుపతిలోని ఎడిఫై ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ఆర్.తనిష్క, ఆర్.అదితి, ఆర్.చరణ, కె.శాతర్ష ఈనెల 7వ తేదీన చత్తీస్‌గడ్‌లో జరిగిన నేషనల్ లెవెన్ అథ్లెటిక్స్ అండర్–14 వంద మీటర్ల రిలే పరుగు పందెంలో విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులను యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

చంద్రగిరి : వివాహేతర సంబంధం ఓ వ్యక్తి ప్రాణాలను బలి తీసుకుంది. భార్య వేరొకరితో సహజీవనం చేస్తూ, కాపురానికి రాలేదని మనస్తాపంతో ఒంటిపై సోమవారం ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వివరాలు.. విజయవాడలోని పాయకాపురానికి చెందిన మణికంఠ (32)కు పదేళ్ల క్రితం వివాహమైంది. అయితే మనస్పర్థల కారణంగా భార్యతో విడిపోయాడు. అలాగే తిరుత్తణికి చెందిన దుర్గ అనే మహిళ తన భర్త నుంచి విడిపోయి ఒంటరిగా ఉంటోంది. ఆమెతో మణికంఠకు పరిచయం ఏర్పడింది. ఇరువురూ పెద్దల సమక్షంలో రెండో పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. ఇటీవల నుంచి మణికంఠ తరచూ దుర్గను వేధించేవాడు. దీంతో ఆమె భర్తను వదలి తిరుపతికి వచ్చేసింది. ఇక్కడ సోను అనే వ్యక్తి పరిచయం కావడంతో అతడితో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇద్దరూ భాకరాపేటలోని ఓ తోటలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలోనే పిల్లల కోసం అప్పుడప్పుడూ మణికంఠకు ఫోన్ చేస్తుండేది. అలా ఫోన్ చేసే సమయంలో తాను భాకరాపేటలో ఉంటున్నట్లు వెల్లడించింది. వెంటనే మణికంఠ భార్య కోసం వచ్చేశాడు. చంద్రగిరి పోలీసులను ఆశ్రయించాడు. అయితే భర్తతో వెళ్లడం ఇష్టం లేదని దుర్గ తేల్చి చెప్పడంతో శ్రీనివాసులు అనే కానిస్టేబుల్ ఇందులో జోక్యం చేసుకున్నాడు. ఆమె రానంటున్నప్పుడు ఎందుకు ఇబ్బంది పెడతావని మణికంఠను హెచ్చరించాడు. దీంతో మనస్తాపం చెందిన మణికంఠ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు వెంటనే అతడిని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు.

కానిస్టేబుల్‌కు చుట్టుకుంటున్న కేసు!

మణికంఠ ఆత్మహత్య కేసు కానిస్టేబుల్ శ్రీనివాసులు మెడకు చుట్టుకుంటోంది. దుర్గ, సోను పని కోసం ఆశ్రయిస్తే వారు భార్యాభర్తలనుకుని కూలి పని ఇప్పించానని శ్రీనివాసులు వెల్లడిస్తున్నాడు. మణికంఠతో ఆమెకు వివాహమైన విషయం తెలియగానే వారిని కలిపేందుకు యత్నించానని, దుర్గ ససేమిరా అనడంతో మణికంఠకు ఫోన్‌చేసి విషయం తెలిపినట్లు వివరిస్తున్నాడు. ఇదే తనకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ క్రమంలో మృతుడు మణికంఠపై పలు చోరీ కేసులు నమోదైనట్లు పోలీసు విచారణ తేలింది.

కానిస్టేబుల్ సస్పెన్షన్

ఈ ఘటనకు సంబంధించి కానిస్టేబుల్‌ను పోలీసు శాఖ సస్పెండ్ చేసింది. సమగ్ర దర్యాప్తు అనంతరం అతనిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీస్ శాఖ తెలిపింది. బాధితుడు ఆత్మహత్యాయత్నంపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది.

బధిర విద్యార్థికి నిప్పు

- సహచర విద్యార్థుల ఆకతాయితనంతో తీవ్ర గాయాలు
- మెరుగైన వైద్య కోసం సీఎంసీకి తరలింపు



విద్యార్థి పరిస్థితి తెలుసుకుంటున్న టీటీడీ జేఈఓ సదా భార్గవి

తిరుపతి (అలిపిరి) : తిరుపతిలోని బధిర పాఠశాలలో మంగళవారం సాయంత్రం ఓ విద్యార్థికి సహచర విద్యార్థులే ఆకతాయితనంతో నిప్పంటించారు. వివరాలు.. వడమాలపేట రజక కాలనీకి చెందిన దాము కుమారుడు చందు బధిర పాఠశాలలో చదువుకుంటున్నాడు. సుమారు 4 గంటల ప్రాంతంలో విద్యార్థుల మధ్య చిన్నపాటి ఘర్షణ తలెత్తింది. దీంతో చందుపై కొంతమంది టర్పెంటైన్ ఆయిల్ పోసి నిప్పంటించేశారు. దీంతో బాధితుడు తీవ్రంగా గాయపడ్డాడు. సుమారు 70శాతం శరీరం కాలిపోయింది. విషయం తెలుసుకున్న అధికారులు గాయపడిన విద్యార్థిని రుయాకు తరలించారు. బుధవారం ఈ మేరకు టీటీడీ జేఈఓ సదాభార్గవి, డీఈఓ భాస్కర్‌రెడ్డి రుయాకు చేరుకుని సూపరింటెండెంట్‌తో మాట్లాడారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తరలించారు. జేఈఓ మాట్లాడుతూ బధిర పాఠశాలలో పిల్లల ఆకతాయితనంతో అనుకోకుండా జరిగిన సంఘటనగా భావిస్తున్నామని.. పూర్తిస్థాయిలో విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థి చికిత్సకు అయ్యే ఖర్చును పూర్తిగా టీటీడీ భరిస్తుందన్నారు. విద్యార్థి ప్రాణానికి ఎలాంటి ప్రమాదం లేదని తెలిపారు. ఈ సందర్భంగా బాధిత తల్లిదండ్రులు తమకు న్యాయం చేయాలని కోరారు.

వినాయకునికి గోవుల బహూకరణ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారికి రెండు గోవులను అమరరాజా సంస్థల అధినేత గల్లా రామచంద్రానాయుడు, గల్లా అరుణకుమారి కుటుంబం బుధవారం ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డికి అందజేశారు. మధ్యాహ్నం గల్లా కుటుంబం బహూకరించిన రెండు గోవులను వారి వ్యక్తిగత సభ్యులు బాలకృష్ణారెడ్డి ఆలయ చైర్మన్‌కు అందజేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు శేఖర్ గురుకుల్ గోవులకు పూజలు చేసి గోశాలకు తీసుకెళ్లారు. దాతలకు ఆలయాధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోపు వంద శాతం జీఈఆర్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఐఓ ప్రభాకర్‌రెడ్డి

- అందరికీ అమ్మ ఒడి పథకం వర్తింపు
- అధికంగా పరీక్ష ఫీజు వసూలు చేస్తే జరిమానా
- ఆర్ఐఓ ప్రభాకర్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : నెలాఖరులోపు 2022–23 విద్యాసంవత్సరంలో ఇంటర్ ఫెయిలైన విద్యార్థులందరినీ తిరిగి ఎన్‌రోల్‌మెంట్ చేయించేలా చర్యలు తీసుకోవాలని, ఈ నెలాఖరులోపు గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో(జీఈఆర్) పూర్తి చేయాలని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్లను ఆర్ఐఓ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో బుధవారం ఉదయం ప్రభుత్వ, మధ్యాహ్నం ప్రైవేటు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో జీఈఆర్‌పై ఆయన సమీక్షించారు. 2023 అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో తప్పిన ద్వితీయ సంవత్సర విద్యార్థులందరినీ గుర్తించి వారిని 2024 పబ్లిక్ పరీక్షకు హాజరయ్యేలా వారితో ఫీజులు కట్టించాలని ఆదేశించారు. ఫెయిలైన విద్యార్థులు తిరిగి ప్రవేశం పొందే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని, పైగా వీరికి అమ్మ ఒడి పథకం సైతం వర్తిస్తుందని, ఈ విషయాన్ని విద్యార్థులకు వివరించి అడ్మిషన్లు పొందేలా చూడాలన్నారు. తిరుపతి జిల్లాలో 187కళాశాలల్లో 5,885 మంది విద్యార్థులు ఫెయిలయ్యారని, ఇప్పటి వరకు వీరిలో 62శాతం మంది విద్యార్థులే పరీక్ష ఫీజు చెల్లించారని, వంద శాతం విద్యార్థులు ఫీజు చెల్లించేలా ఆయా కళాశాలలు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన పరీక్ష ఫీజుల కంటే అధికంగా వసూలు చేస్తే ఆ కళాశాల యాజమాన్యంపై కఠిన చర్యలతో పాటు రూ.2 లక్షల నుంచి రూ.5లక్షల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవీఈఓ విశ్వనాథనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

ఓటు హక్కు ప్రతి పౌరుని ప్రాథమిక హక్కు అని, 2024 జనవరి 1నాటికి 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేయించుకోవాలని తిరుపతి జిల్లా ఇన్‌స్టిట్యూషనల్ నోడల్ ఆఫీసర్, ఆర్ఐఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో నోడల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో బీఎల్ఓలు విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఓటరుగా ఎలా నమోదు చేసుకోవడంతో పాటు ఓటరు ఐడీని ఆధార్‌తో అనుసంధానం చేయించుకోవాలని తెలిపారు.

ఆయా కర్కశత్వం

వి.కోట: అంగన్‌వాడీలో పనిచేసే ఓ ఆయా ఓ చిన్న పిల్లాడిపై కర్కశత్వం చూపించింది. ఈ ఘటన చూసిన వారి మనసులను కలచివేసింది. బాధితుడి తల్లిదండ్రుల కథనం మేరకు.. మండలంలోని కృష్ణాపురం అంగన్‌వాడీ కేంద్రంలో రఫీక్ కుమారుడు రియాన్(4) అనే చిన్నారి చదువుకుంటున్నాడు. యథావిధిగా బుధవారం కేంద్రానికి వచ్చాడు. పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న ఆయాను కోడిగుడ్డు ఇవ్వాలని అడిగాడు. దీంతో ఆగ్రహించిన ఆయా గాయత్రి చిన్నారిపై వేడినీళ్లు పోసింది. దీంతో రియాన్‌కు ఛాతీపై గాయం అయ్యింది. విషయం తెలుసుకున్న చిన్నారి తల్లిదండ్రులు రియాన్‌ను వి.కోట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. అయితే చిన్నారి ఇంటి వద్ద నుంచే గాయంతో బడికి వచ్చాడని, తామేమి పిల్లాడిపై వేడినీళ్లు పోయలేదని ఆయా తన తప్పును కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నం చేసింది. విషయం తెలుసుకున్న సీడీపీఓ, ఉన్నతాధికారులు గ్రామానికి చేరుకుని ఆరా తీశారు. అంగన్‌వాడీ నిర్వాహకురాలు, సిబ్బందికి మెమో జారీ చేశామని, వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



తుపాను ప్రభావంతో వాకాడు మండలంలోని తీర ప్రాంతంలో కడలి కల్లోలంగా ఉంది. సముద్రం కసురు మీద ఉండడంతో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకూడదని అధికారులు ఆదేశించారు. దీంతో బోట్లు ఒడ్డున విశ్రాంతి తీసుకుంటున్నాయి.

– మహ్మద్‌రఫీ, సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి